

వరదరాజస్వామి ఆలయ అర్చకుడి సస్పెన్షన్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధ వరదరాజస్వామి ఆలయంలో అర్చకుడు వీఆర్.రఘునందన్ సస్పెండయ్యారు. చిత్తూరుకు చెందిన కళావతి కాణిపాకం గోశాలకు ఆవును ఇవ్వాలని భావించిం అర్చకుడు రఘునందన్‌ను సంప్రదించింది. ఈక్రమంలో అతడు ఆమె వద్ద రూ.10వేలు తీసుకున్నాడు. తర్వాత ఆమె ఫోన్ చేస్తున్నా స్పందించకపోవడంతో ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసింది. అధికారులు రఘునందన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయినా అర్చకుడు పట్టించుకోకపోవడంతో శనివారం సస్పెండ్ చేశారు. దీనిపై ఈవో కిషోర్ మాట్లాడుతూ ఎవరైనా విరాళాలను సమర్పించాలనుకుంటే సంబంధిత కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు. దాతల నుంచి ఎవరైనా డబ్బు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

11న విజయపురం ఎంపీపీ ఎన్నిక

విజయపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్ర తెలిపారు.ఎంపీటీసీలు హాజరు కావాలని సూచించారు.ఎంపీపీ జమున రాజీనామా చేయడంతో ఇన్‌చార్జి ఎంపీపీగా మంజు బాలాజీ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఎస్సీ, ఎస్టీ మహిళలకు 'ఉజ్వల్' గ్యాస్ కనెక్షన్లు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఎస్సీ, ఎస్టీ నిరుపేద వర్గాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 3929విలువ కలిగిన సెక్యూరిటీ డిపాజిట్, రెండు బర్నర్లు, మొదటి రీఫిల్‌ను ఉజ్వల్ గ్యాస్ కనెక్షను కింద ఉచితంగా అందిస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సచివాలయ పరిధిలో వీఆర్వోల ద్వారా ఈ సౌకర్యంపై అవగాహన కల్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్యాస్ కనెక్షన్లు లేని ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన వర్గాలు సమీప డీలర్ల వద్ద దరఖాస్తు చేసుకుని ఈ సౌకర్యాన్ని పొందాలని సూచించారు.



సభ్యుల చర్చతోనే ముగిసిన జడ్పీ సమావేశం

సమస్యల ఏకరువు

మళ్లీ గైర్హాజరైన జిల్లాస్థాయి అధికారులపై చర్యలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లాలో నెలకొన్న సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు.అయితే సమావేశానికి కొన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు రాకపోవడంతో ఎలా చర్చించాలని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎవరెవరు సమావేశానికి హాజరు కాలేదో వారందరిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ముందుగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు జడ్పీ పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను వివరించారు.సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాలేదు.ఒక్క ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాత్రం హాజరయ్యారు.జిల్లాలో అధికంగా నమోదవుతున్న స్ర్కబ్ టైఫస్ కేసుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, రామసముద్రం జడ్పీటీసీ రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాధి ఇంకా ప్రబలక ముందే అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని, ఎక్కడిక్కడే పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ వ్యాధి ఎలా వ్యాపిస్తుందనే విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు తరచూ ఫుడ్ పాయిజన్ బారిన పడుతున్నారని , నెలకు రెండు సార్లు విధిగా వైద్యుల బృందం హాస్టళ్లను సందర్శించాలని కోరారు.జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పడమటి మండలాల్లో రైతులకు యూరియా అందడం లేదని, గత రెండు సమావేశాల్లో దీన్ని ప్రస్తావించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై కలెక్టర్ కలగజేసుకొని వ్యవసాయ శాఖ వచ్చే మూడు నెలల్లో ఏం చేస్తుంది? యూరియా పంపిణీలో కిందిస్థాయి అధికారులకు ఏ విధమైన సూచనలు ఇచ్చారో సభలో వివరించాలని అధికారులకు సూచించారు.నారాయణవనం జడ్పీటీసీ సుమన్ మాట్లాడుతూ సొంత స్థలాలున్నవారు ఇంటి నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి పోతే రూ.25 వేలు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయలేదనగా వారంలో అందజేస్తామని వ్యవసాయ అధికారులు చెప్పారు. ఎర్రావారిపాళ్యం,వడమాలపేట జడ్పీటీసీలు కరుణాకర రెడ్డి,మురళీ రెడ్డి,బంగారుపాళ్యం ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ జిల్లాలో గోకులం షెడ్లన్నీ అనర్హులకే కేటాయించారని ఆరోపించారు.స్పందించిన డ్వామా పీడీ అనర్హులకు షెడ్లు మంజూరు చేయలేదని చెప్పడంతో కొంతమంది సభ్యులు లేచి అనర్హులకు ఇవ్వలేదని తేలిస్తే రాజీనామా చేస్తావంటూ ఆవేశపడ్డారు.కలెక్టర్ కలగజేసుకొని ఎవరెవరు అర్హులున్నారో వివరాలు సేకరించి ఇస్తే పరిశీలించి షెడ్లు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక మాట్లాడుతూ దళారుల కారణంగా టమోటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మదనపల్లె, పలమనేరు, గుర్రంకొండ... ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటు ఎందుకుందో అధికారులు చెప్పాలని నిలదీశారు.ఉపాధి పనుల మస్టర్లను పరిశీలించాలని అడిగితే కలెక్టర్ చూపవద్దన్నారని ఏపీవో చెప్పారంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గుడుపల్లె మండలం సోడిగంపల్లి జడ్పీ హైస్కూల్‌కు త్రీఫేజ్ కరెంటు లేక తాగునీటికి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని జడ్పీటీసీ కృష్ణమూర్తి చెప్పగా స్పందించిన కలెక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గుడుపల్లె నుంచి ఇరిసిగానిపల్లి, వెంకటాపురం గ్రామాలకు వెళ్లేందుకు మార్గం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒక్క వంతెన నిర్మిస్తే 10 గ్రామాల రాకపోకలకు ఇబ్బంది తీరుతుందని వివరించారు.డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ బాధితులు

పెరుగుతున్నారు!

- వెలుగులోకి మరో ఐదు కేసులు

చిత్తూరు రూరల్/సదుం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. తాజాగా ఐదు కేసులు వెలుగు చూశాయి. ఇందులో చిత్తూరు నగరంలోని కట్టమంచి, మురకంబట్టుల్లో మూడు కేసులు నమోదు కాగా జీడీనెల్లూరు మండలంలో ఒకటి, సదుం మండలంలోని అమ్మగారిపల్లె పంచాయతీ కలకటవారి పల్లెలో మరో కేసు నమోదయ్యాయి.రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నా జిల్లా అధికారుల తీరు మారడం లేదు. కనీసం ఇంత వరకు ఈ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదని విమర్శలున్నాయి. సదుం మండలంలో స్క్రబ్ టైఫస్ బారిన పడిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి చరణ్ తెలిపారు.గ్రామంలో స్క్రబ్ టైఫస్ కేసు నమోదు కావడంతో వైద్య బృందం మలాథిన్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు.స్థానికులకు వ్యాధితో పాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గజరాజుల కదలికలపై సీసీఎఫ్ పరిశీలన

జీపీఎస్ మైక్రో చిప్ ఏర్పాటుకు అనువైన ప్రాంతం కోసం అన్వేషణ



కల్లూరు సమీపంలో అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ యశోదాబాయి

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై దాడులు చేస్తున్న గజరాజుల కదలికలపై పనపాకం రేంజ్, చిత్తూరు పశ్చిమ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో శనివారం అనంతపురం చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ యశోదాబాయి పరిశీలించారు. ముందుగా పులిచెర్ల మండల సరిహద్దులో ఉన్న తిరుపతి జిల్లా పనపాకం రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతం వద్దకు చేరుకున్న యశోదాబాయి ఏనుగులు సంచరిస్తున్న తీరును పరిశీలించారు. అక్కడి నుంచి చిత్తూరు పశ్చిమ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతం వద్దకు చేరుకున్నారు. అడవిలో ఏనుగులు సంచరిస్తున్న ప్రాంతాల వివరాలను డీఎఫ్‌వో శ్రీనివాసులు, రేంజర్ థామస్ సుకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.ఏనుగుల గుంపు కదలికలను గుర్తించేందుకు, వాటిని రక్షించేందుకు సాంకేతిక విధానంతో జీపీఎస్ మైక్రో చిప్‌ను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతం కోసం అన్వేషించారు. ఏనుగు చర్మం భాగంలో జీపీఎస్ చిప్ అమర్చేందుకు అటవీ ప్రాంతంలో రాళ్లు, గుండ్లు, ఎగుడు, దిగుడు ప్రాంతాలు కాకుండా మైదానంలా ఉండే ప్రాంతాన్ని ఎంచుకోవాల్సి ఉంది. అడవిలో అనువైన ప్రాంతం కోసం సీసీఎఫ్ యశోదాబాయి అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. కుంకీ ఏనుగులతో పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును కట్టడి చేసేందుకు సాధ్యాసాధ్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏనుగులు సంచరించే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల పనితీరు, సోలార్ కంచె ఏర్పాటుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, రేంజర్లు మాధవి, పట్టాభి, ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 177 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,693, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,185 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,196 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 716, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 276, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 236, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,171 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.

టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ సంస్థ ప్రతినిధులు బాబురావు , శశాంక్ ఈ విరాళాన్ని హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు సదాశివరావు కూడా ఉన్నారు.


సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,336

తలనీలాలు సమర్పించినవారు: 25,063



SUNDAY FOCUS



గూడూరు గడియారం సెంటర్

దుగరాజపట్నంతో ముడి పెట్టి అడ్డుకుంటారా?



తిరుపతి జిల్లాకు దుగరాజపట్నం పోర్టు ఉండాలనే గూడూరును తిరుపతిలో ఉంచుతున్నామని చెప్పడం సమంజసం కాదు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి అవకాశం లేదని 2018లోనే నీతి అయోగ్ తేల్చి చెప్పింది. రాష్ట్ర విభజన హామీ చట్టంలో ఈ అంశం పొందిపరిచినా ముందుకు సాగలేదు. ఇప్పుడు మళ్లీ దాంతో ముడిపెట్టి అడ్డుకోవడం అన్యాయం.

- వి.రాజేంద్రప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, గూడూరు



నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్

● రగులుకుంటున్న డిమాండ్

గూడూరు బంధం నెల్లూరుతోనే

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో తిరిగి కలపకుండా అడ్డుకుంటున్న అంశాలేమిటి? అడ్డుకుంటున్న శక్తులు ఎవరు? ఏ కారణాలు ప్రజల బలమైన ఆకాంక్షను కూడా లెక్కచేయడం లేదు? అధికార కూటమికి రాజకీయంగా తీవ్ర నష్టం కలిగించే నిర్ణయమని తెలిసీ ఎందుకు అడుగు ముందుకే వేస్తున్నారు?.. ఇవీ ఇప్పుడు గూడూరు నియోజకవర్గం లోనే కాకుండా, నెల్లూరు జిల్లాలోనూ, తిరుపతి జిల్లాలోనూ ప్రజల్లో మెదులుతున్న ప్రశ్నలు. ఇందుకు సహేతుక కారణాలున్నాయని చెబుతున్న అంశాలను ప్రజలు అసలు నమ్మడం లేదు. రోజురోజుకూ ఈ డిమాండ్ బలం పుంజుకుంటూనే ఉంది. వినతులు, వేడుకోళ్ల దశ దాటి నిరసనల స్థాయికి చేరుకుంది.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

నెల్లూరులో ఎందుకు?

నెల్లూరుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. భాష, యాస, ఆహారపు అలవాట్లలో ఈ ప్రత్యేకత కనిపిస్తుంది. తిరుపతి ప్రాంతానికి వీటికీ ఎంతో కొంత తేడాలుంటాయి. పైగా గూడూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నెల్లూరు జిల్లాలో కొనసాగుతూ వస్తోంది. బంధుబలగాలు, పెళ్లి సంబంధాలు, ఉపాధి పనులు, ఉద్యోగాలు, వ్యాపార సంబంధాలు, చదువులు, వైద్యం.. అన్నీ నెల్లూరుతోనే ముడిపడి ఉంటాయి. పైగా చేరువన ఉండే నెల్లూరును కాదని దూరంగా ఉండే తిరుపతితో అనుబంధం పెంచుకోవడం అంత సులువు కాదు.


లేని, రాని పోర్టు కోసమా?

తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యతో నిరాశ పెంచింది. తిరుపతి జిల్లాకు కుడా ఒక పోర్టు ఉంటే అభివృద్ధి సమతుల్యంగా ఉంటుందనేది ప్రభుత్వ భావనని, అందుకే వాకాడు మండలంలోని దుగరాజపట్నం కోసం తిరుపతిలోనే కొనసాగించాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించినట్లు వివరించారు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పటి ఎంపీ చింతామోహన్ పట్టుదల వల్ల రాష్ట్ర విభజన చట్టంలోనూ పొందుపరిచింది. దీంతో 2014లో దుగరాజపట్నంతో పాటు తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, పామంజి, వాగ్రు, శ్రీనివాసపురం గ్రామాల్లో సుమారు 2,700 ఎకరాల భూములను గుర్తించారు. అయినా పోర్టు నిర్మాణానికి ముందడగు పడలేదు. సాంకేతికంగానూ, ఆర్థికంగానూ దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణం ప్రయోజనకరం కాదని అప్పట్లోనే నీతి అయోగ్ స్పష్టం చేసింది. దీంతో ఇది అటకెక్కింది. అప్పటి నుంచి నేటి వరకు కుడా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ చింతామోహన్ దుగరాజపట్నం పోర్టు కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నా ఫలితం లేకుండా పోయింది. అయితే సీఎం చంద్రబాబునాయుడు ఈ ఏడాది మే నెలలో దుగరాజపట్నం వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.3,500 కోట్లతో నౌకానిర్మాణ కేంద్రాన్ని, ఓడల మరమ్మతుల యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. అంటే పోర్టు స్థానంలో ఇవి ఏర్పాటు చేస్తారన్నమాట. మరి పోర్టు కోసమే తిరుపతి జిల్లాలో కొనసాగించాలన్న నిర్ణయంలో అర్థమేమిటనే ప్రశ్న ప్రజల నుంచి వస్తోంది.

వైసీపీ పాపం.. కూటమికి నష్టం

జగన్ ప్రభుత్వం నెల్లూరుతో పెనవేసుకున్న బంధాన్ని పుటుక్కున తెంచేసింది. తిరుపతి జిల్లాలో గూడూరు నియోజకవర్గాన్ని భాగం చేసింది. దీనిపై ఆ పార్టీ నాయకులెవరూ నోరు కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆకాంక్షను గ్రహించి ఎన్నికలకు ముందు నారా లోకేశ్, చంద్రబాబు ఇద్దరూ గూడూరును తిరిగి నెల్లూరులోనే కలుపుతామని హామీ ఇచ్చారు. వీరి మాటలపై నమ్మకంతో ఉన్న ప్రజలు తాజా నిర్ణయంతో విస్తుపోయారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే విలీనం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించినా, అనంతరం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఈ అంశం లేదు. దీంతో ప్రజలు కోపంతో ఉన్నారు.

మీరిచ్చిన హామీలకే విలువ లేదా?



గత ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతిలో గూడూరును తిరుపతి జిల్లాలో కలిపింది. అప్పట్లో ప్రజలు వ్యతిరేకించినా పట్టించుకోలేదు. ప్రజలు ఓట్ల ద్వారా తమ తీర్పును ప్రకటించారు. ఇప్పటి ప్రభుత్వం కూడా అదే దారిలో వ్యవహరిస్తోంది. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలకే విలువ లేకపోతే ఎలా? గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేంత వరకు, జేపీసీ ఆధ్వర్యంలో శాంతియుత పోరాటాలు సాగిస్తూనే ఉంటాం.

- బి.దశరథరామిరెడ్డి, జేపీసీ కన్వీనర్, గూడూరు

ఇంత కష్టపెట్టడం అవసరమా?



టీచర్లు శిక్షణా తరగతులు, కౌన్సెలింగ్, స్పాట్ వాల్యూయేషన్‌లకు జిల్లా కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. గూడూరు నుంచి నెల్లూరుకు 40 కిలోమీటర్లు. తిరుపతికి వెళ్లి రావాలంటే దూరం, కష్టం ఎక్కువ. ప్రజల కోరికను మన్నించి గూడూరును నెల్లూరులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్.చిరంజీవి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గూడూరు.

మా బంధాలు తెంచేసుకోవాలా?



నాకు ఇద్దరు చెల్లెళ్లు. ఇద్దరికీ నెల్లూరు సంబంధాలే చేసుకున్నాం. నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కోడలిది అప్పటి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట. రెండో వాడికి ఇప్పటి నెల్లూరు జిల్లాలోనే సంబంధాలు చూస్తున్నాం. నెల్లూరుతోనే మా సంబంధబాంధవ్యాలన్నీ ఉంటాయి. మమ్మల్ని తీసకపొయ్యి తిరుపతిలో పెడితే ఎట్ల? ఇదేమి న్యాయం?

- జీ.రామచంద్రయ్య, వ్యాపారి, గూడూరు

మా గోడు ప్రభుత్వానికి పట్టదా?



నేను సీజన్ వ్యాపారిని. పదేళ్లగా గూడూరు నుంచి నెల్లూరుకు రోజూ వెళ్తాను. నెల్లూరు హోల్‌సేల్ షాపుల నుంచి స్టీల్ సామాన్లు తెచ్చి గూడూరులోని దుకాణాలకు అందిస్తుంటాను. గూడూరులో పది స్టీల్ సామాన్లు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. ఇదే నా ఉపాధి. నెల్లూరుకు చార్జీల ఖర్చు తక్కువ కాబట్టి వ్యాపారం సాగుతోంది. ఇదే తిరుపతితో చేయగలనా? నా మాదిరే రోజూ నెల్లూరు పొయ్యి వ్యాపారాలు చేసుకునేవాళ్ల గూడూరు ప్రాంతంలో ఎందరో ఉన్నారు. మా గోడు ప్రభుత్వం వినాలి.

- జే.సురేష్‌బాబు, సీజన్ వ్యాపారి, గూడూరు



దుగరాజపట్నం గ్రామం

దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ



క్రీడల్లో ప్రతిభచూపిన దివ్యాంగులను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

● విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇంటి వద్దకే పింఛను పంపిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, అందులో ఉచిత బస్సు ఒకటి అని అన్నారు. గృహ నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అంతకు ముందు విభిన్న ప్రతిభావంతులను సన్మానించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పురుషోత్తంరెడ్డి, కాంచన, దివ్య, విమల, శివ, కార్తీకలను అభినందించారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, రుద్రకోటి సదాశివం, పసుపులేటి హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు సుబ్రమణ్యం, మురళి, రామచంద్ర పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరేళ్ల క్రితం ఫిర్యాదు.. ఇప్పుడు స్పందన

● బాధ్యుల్లో ఇప్పటికే చాలామంది ఉద్యోగ విరమణ ● ఫిర్యాదుదారుడు మృతి

● ఎవరిపై చర్యలు తీసుకోవాలో అర్థంగాక తలలు పట్టుకుంటున్న అధికారులు

డక్కిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల క్రితం చేసిన ఫిర్యాదుకు అధికారులు ఇప్పుడు స్పందించి చర్యలకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. డక్కిలి మండలం పలుగోడు పంచాయతీ పరిధిలోని నాగులపాడు, తిమ్మాయపాళెం, పలుగోడు, హరిజనవాడలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షలతో సిమెంటు రోడ్లు వేశారు. అయితే ఈ పనులు నాసిరకంగా జరిగాయంటూ పలుగోడుకు చెందిన రుషేంద్రరెడ్డి అప్పట్లోనే విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్సు విభాగం అప్పట్లో విచారణ జరిపి నివేదిక తయారు చేసింది గాని, అది వెలుగులోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ నివేదికను బయటకు తీసి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమిస్తూ సంబంధిత శాఖలకు నోటీసులు జారీ చేసింది. అయితే ఆ సమయంలో పనులను పర్యవేక్షించిన అధికారులు చాలామంది ఇప్పటికే రిటైర్ అయ్యారు. ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఈఈగా పనిచేసిన రమణయ్య మాత్రమే ప్రస్తుతం నెల్లూరు పీఐయూలో డీఈగా ఉన్నారు. డీఈ, జేఈ వంటి ఇంజనీర్లు ఉద్యోగ విరమణ పొందారు. ఫిర్యాదుదారుడు రుషేంద్రరెడ్డి కూడా చనిపోయారు. దీంతో చర్యలు ఎవరిపై తీసుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సేవలు అభినందనీయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండులో హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో హోంగార్డులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని కోరారు. ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని పీఎం సురక్ష బీమా యోజన వంటి పథకాల్లో చేరాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన హోంగార్డులకు ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసులు, రామకృష్ణ, ఏవో రమేష్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

కార్బన్ కంపెనీలో మొబైల్ ఫోన్ల చోరీ

ఏర్పేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి సమీపంలో ఉన్న కార్బన్ మొబైల్ కంపెనీలో రెండు రోజుల క్రితం ఆ కంపెనీలో పనిచేస్తున్న నలుగురు కార్మికులు ఆరు మొబైల్‌ఫోన్లను చోరీ చేశారు. ప్యాకింగ్ సమయంలో చెక్ చేసుకున్న సిబ్బంది ఆరు మొబైళ్లు తక్కువ వచ్చాయి. ఈ క్రమంలో కంపెనీ అధికారులు పలువురు కార్మికులను విచారించారు. సీసీ పుటేజీని పరిశీలించారు. నలుగురు కార్మికులు మొబైల్ ఫోన్లను ఒక సెక్యూరిటీ గార్డు సాయంతో బయటకు తీసుకెళ్లినట్లు గుర్తించారు. శనివారం విధులకు వచ్చిన ఆ నలుగురు కార్మికులను కంపెనీ అధికారులు విచారించారు. తిరిగి అప్పగించాలని సూచించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొబైల్‌ఫోన్ల చోరీ వాస్తవమేనని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బీసీలంటే జగన్‌కు చిన్నచూపు

● ఆవు, లేగ దూడతో యాదవుల నిరసన

తిరుపతి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): బీసీలంటే వైసీపీ అధినేత జగన్ రెడ్డికి లెక్క లేదని, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదని యాదవ సంఘ నాయ కులు మండిపడ్డారు. సీనియర్ ఐపీఎస్ అధికారులైన కృష్ణయ్య, గోపీనాథ్ జెట్టిలను వాడూ, వీడూ అని జగన్ వ్యాఖ్యానించడంపై తిరుపతి యాదవ సమైక్య సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద ఆవు, లేగ దూడలను పూజిస్తూ, ప్లకార్డులను చేతపట్టుకుని నిరసన తెలిపారు. వైసీపీ వైఖరితో బీసీలు చాలామంది ఆత్మహత్య చేసుకున్నారని మండిపడ్డారు. యాదవులకు జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, యాదవ సంఘ నాయకులు కట్ట జయరాం, ఈతమూకల హేమంత్, కృష్ణ, అశోక్ సామ్రాట్, రామచంద్ర, పుష్పావతి, చిత్తూరు రవిశంకర్, మధుసూదన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆవుదూడతో నిరసన తెలుపుతున్న యాదవ సంఘం నాయకులు

శెట్టిపల్లె టౌన్‌షిప్ పనులు మొదలుపెట్టండి

● తుడా అభివృద్ధికి ప్రాధాన్యత

● పాలకమండలి సమావేశంలో తీర్మానం



తిరుపతి, డిసెంబర్6(ఆంధ్రజ్యోతి) : తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) పరిధిలో అబివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తుడా కార్యాలయంలో శనివారం నిర్వహించిన తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ బోర్డు సమావేశంలో కలెక్టర్‌తో పాటు తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, వీసీ ఎన్.మౌర్య, ఎంఏయూడీ ఓఎస్డీ వెంకట సుబ్బయ్య, ఆర్డీ శ్రీనివాసులు పాల్గొని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. శెట్టిపల్లి టౌన్‌షిప్ ఏర్పాటు చేయనున్న ప్రాంతం చదును, శుభ్రం చేసేందుకు టెండర్ పిలవాలని, పెరుమాళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాలకు గ్యాస్ ఆధారిత శ్మశాన వాటిక, కర్మక్రియల షెడ్డు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఉప్పరపల్లి నుంచి మహిళా విశ్వవిద్యాలయం వరకు నాలుగు లైన్ల రోడ్డుకు, మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రేణిగుంట మండలం సూరప్పకశం వద్ద తుడా పరిధిలో ఏర్పాటు చేసిన పద్మావతినగర్ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, సీపీఓ దేవికుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి

మంగళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే ఉన్నత అవకాశాలను చేజిక్కించుకోవచ్చని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ చెప్పారు. తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్లో శనివారం బాలల సైన్స్ ఫెస్టివల్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఫెయిర్ మోడల్స్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, క్రమశిక్షణను అలవరచుకోవాలని తెలిపారు. పురోగతికి దోహదం చేసే పరిశోధనలకు కృషి చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి టెంకాయల దామోదర్ అధ్యక్షత వహించగా రీజనల్ సైన్స్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ, మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.



విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

వంద రోజుల స్టడీ ప్రణాళిక ప్రారంభం

● రోజూ స్లిప్ టెస్టు ● పర్యవేక్షించనున్న కలెక్టర్



విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ టెస్టు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు వంద రోజుల స్టడీ అవర్ ప్రణాళిక శనివారం నుంచి మొదలైంది. వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు టెన్త్ పరీక్షల నేపథ్యంలో ఇప్పటినుంచే అధికారులు గట్టి కసరత్తుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు సంబంధించి 537 ఉన్నత పాఠశాలల్లో 20వేల మంది టెన్త్ విద్యార్థులు ఉన్నారు. ఇందులో 355 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో దాదాపు 9 వేల మంది ఉన్నారు. మార్చి 15 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజూ వివిధ సబ్జెక్టుల్లో రివిజన్ అపై పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఉదయం 8-9 గంటల మధ్య రెమిడియల్ తరగతి ఉంటుంది. 9.15-10.40 వరకు ఫస్టు సెషన్, 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు సెకండ్ సెషన్, 1.05-2.30 గంటలకు మూడో సెషన్, 2.40 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నాల్గో సెషన్, 4-5 గంటల మధ్య అసెస్మెంట్ (స్లిప్ టెస్టు) పరీక్ష నిర్వహించాలి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఫిజిక్స్, బయాలజీ, సోషల్‌స్టడీస్‌లలో ప్రతి రోజూ నాలుగు సబ్జెక్టులు ఖచ్చితంగా రివిజన్ చేయిస్తారు. పరీక్ష అనంతరం పేపర్లు మూల్యాంకనం చేసి వెనువెంటనే లీప్ యాప్‌లో మార్కులు పోస్టు చేయాల్సి ఉంది. లీప్ యాప్‌ను జిల్లా కలెక్టర్ రోజూ పర్యవేక్షించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు, మార్చి 2 నుంచి 12వ తేదీ వరకు గ్రాండ్ టెస్టు జరుగుతుంది. శని, ఆదివారాల్లోనూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు.

సామాజిక సమానతకు అంబేడ్కర్ బాట

● కలెక్టర్ సుమిత్‌కుమార్ నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులన్నింటినీ కూడా సరిసమానం చేసిన గొప్ప దేశ భక్తుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కలెక్టర్ సుమిత్‌కుమార్ శ్లాఘించారు. శనివారం స్థానిక దర్గా కూడలి వద్ద అంబేడ్కర్‌వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మీడియాతో జిల్లాలో దళితవాడలను అభివృద్ధికి రూ.13కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాలలో అంగన్‌వాడీ, సోలార్‌విద్యుత్, తాగునీటిపైపులనిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణపు పనులు, చేతిబోరు మరమ్మతులు, శ్మశానవాటికల అభివృద్ధి కోసం చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారిని బెదిరించిన గ్రామ కార్యదర్శి

వెదురుకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):నాకే మెమో ఇస్తావా? నీ అంతు చూస్తానంటూ గ్రామ సచివాలయ, వార్డు డెవలప్‌మెంట్ అధికారి(జీఎస్‌డబ్ల్యుఎస్) నిరంజన్‌రెడ్డిపై వెదురుకుప్పం మండలం జక్కిదొన గ్రామ సచివాలయ కార్యదర్శి ఆర్.వి.బాలకృష్ణ బెదిరించారు. వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సంఘటన చర్చనీయాంశమైంది.వెదురుకుప్పం జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి నిరంజన్‌రెడ్డి సచివాలయ ఉద్యోగుల హాజరు, విధి నిర్వహణను పర్యవేక్షించాల్సి వుంది.జక్కిదొన గ్రామ కార్యదర్శి బాలకృష్ణ రెండు రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో శనివారం మెమోను మార్క్ చేసి సచివాలయ కార్యదర్శుల గ్రూపులో పోస్ట్ చేశారు.మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు.ఎంపీడీవో పురుషోత్తం, డీఎల్‌డీవో రవికుమార్, డీపీవో సుధాకరరావుకు సమాచారం ఇచ్చి ఆ మెమోను మార్క్ చేశారు. దీన్ని జీర్ణించుకోలేని బాలకృష్ణ ఎంపీడీవో కార్యాలయం చేరుకుని నిరంజన్‌రెడ్డిని బెదిరించారు.ఈ విషయాన్ని కూడా నిరంజన్‌రెడ్డి డీపీవో సహా జిల్లా అధికారులకు, సెలవులో ఉన్న ఎంపీడీవో పురుషోత్తంకు తెలియజేశారు.

పర్యాటక కేంద్రంగా కంగుంది అభివృద్ధి



కంగుంది చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్‌ఎం తదితరులు

కుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో ప్రాచీనమైన చరిత్ర కలిగిన ఒకప్పటి కంగుంది సంస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కంగుంది దుర్గంపై జనవరి 6, 7 తేదీలలో నిర్వహించనున్న బోల్డ్ రింగ్ జిమ్ (హిల్ ట్రెక్కింగ్) కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని కంగుందిలో శనివారం నిర్వహించారు. కంగుంది చరిత్ర పుస్తకాన్ని ప్రముఖులు ఆవిష్కరించారు. పర్యాటకులు కూర్చునేందుకు అనువైన స్టే హోమ్, కంగుంది గుర్గం ట్రెక్కింగ్ నమూనాలను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మల్లేశ్వర స్వామి వెలసిన కంగుంది దుర్గం ఒకనాటి జమీందారీ వైభవానికి చిహ్నాలన్నారు. గత వైభవాన్ని పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుని ప్రముఖ పర్యాటక కేంద్రంగా కంగుందిని రూపొందిస్తామని, అలాగే కుప్పం నియోకవర్గంలోని ప్రముఖ ఆలయాలు, జలపాతాలు, ఇతర ముఖ్య ప్రదేశాలను కలపుతూ ఆధ్యాత్మిక పర్యాటక కారిడార్ రూపొందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే పర్యాటక శాఖ ద్వారా ప్రణాళిక సిద్ధం చేయించారని చెప్పారు. ఇందులో భాగంగానే జనవరి 6, 7 తేదీల్లో బోల్డ్ రింగ్ జిమ్ కార్యక్రమాన్ని కంగుంది దుర్గం వద్ద నిర్వహిస్తున్నామని, నియోజకవర్గ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, రాజశేఖర్, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, ఆర్డీవో వి.శ్రీనివాసరాజు, పలువురు నాయకులు, తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





బహుమతులు అందుకున్న పిల్లలతో నిర్వాహకులు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి - బాలోత్సవానికి హాజరైన విద్యార్థులు

ఉత్సాహంగా బాలోత్సవం

పలమనేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే విద్యార్థులు దేశభక్తిని అలవరచుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని ఓఎల్ఎల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలన్నారు. క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా రాణించాలని కోరారు. ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. బాలోత్సవంలో నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 3 వేల మందికి పైగా చిన్నారులు హాజరై వివిధ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, ఎంఈవోలు బాలసుందరం, వేణుగోపాలరెడ్డి, తెలుగుదేశం పార్టీనాయకులు సుబ్రహ్మణ్యం గౌడు, కుట్టి, గిరిబాబు, ఖాజాపీర్, నాగరాజు, కృష్ణమూర్తిగౌడు, బీఆర్సీ కుమార్, నదీమ్, శ్రీనివాసులు, మంజునాథ్, మురళీ, సుధాకర్, వీరప్ప, భాస్కర్, కమిటీ సభ్యులు తులసినాథం నాయుడు, యుగంధర్, గిరిధరమూర్తి, బాలాజీ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో వేడెక్కిన రాజకీయం

● ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

గుడిపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.ఎంపీపీ ప్రసాదరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.మండలంలో 12 మంది ఎంపీటీసీ సభ్యులుండగా 8మంది ఎంపీపీపై అవిశ్వాసానికి మద్దతిచ్చారు.మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను గుడిపాల మండలంలో టీడీపీ బహిష్కరించింది. అయితే టీడీపీ తరపున ఒకరు పోటీలో నిలిచారు. 11 స్థానాలను వైసీపీ కైవసం చేసుకోగా ఒక్కస్థానం టీడీపీకి దక్కింది. అప్పటి నుంచి వైసీపీ తరపున గెలిచిన ప్రసాదరెడ్డి ఎంపీపీగా, జయప్రియ, గోపి వైస్ ఎంపీపీలుగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం 11మంది ఎంపీటీసీల్లో ఒకరైన హరి టీడీపీలోకి వచ్చారు. కొందరు టీడీపీ నాయకులతో కలసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు పావులు కదిపారు. ఆర్డీవో ద్వారా ఎంపీటీసీలకు నోటీసులను జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 11.35 గంటలకు ఎంపీడీవో కార్యాలయానికి 8మంది ఎంపీటీసీలు చేరుకున్నారు.ఆర్డీవో శ్రీనివాసులు ముందు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో ఆర్డీవో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రకటించి నివేదికను జడ్పీ సీఈవోకు అందజేయనున్నట్లు తెలిపారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపిన వారిలో నారగల్లు ఎంపీటీసీ జయప్రియ, చిత్తపార ఎంపీటీసీ గోపీనాథ్,గుడిపాల ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద చౌదరి, పానాటూరు ఎంపీటీసీ మొగిలిరెడ్డి, 197రామాపురం ఎంపీటీసీ శ్రీదేవి, బసవాపల్లె ఎంపీటీసీ లీనారాయ్, పాపసముద్రం ఎంపీటీసీ బాలమ్మ, వసంతాపురం ఎంపీటీసీ విజయలక్ష్మి ఉన్నారు.వీరంతా కలిసి త్వరలో కొత్త ఎంపీపీని ఎన్నుకోనున్నారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ రామ్మోహన్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శిరీష, కార్యదర్శి సుందరేశన్ తదితరులు పాల్గొన్నారు.



అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన ఎంపీటీసీలు

అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే

అవిశ్వాస తీర్మానం నెగ్గాక ఎంపీటీసీ సభ్యులు గుడిపాలకొచ్చిన ఎమ్మెల్యే జగన్మోహన్‌ను కలిశారు.ఆయన వారితో మాట్లాడుతూ అభివృద్ధి పనులు కావాల్సి వస్తే ఖచ్చితంగా తాను పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ విషయంలో పార్టీలకతీతంగా వ్యవహరిస్తానని చెప్పారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

● జిల్లా అరుణసారిక



డీజే అరుణసారికకు జ్ఞాపికను అందజేస్తున్న న్యాయమూర్తి

చిత్తూరు లీగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కోర్టులలో దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా న్యాయమూర్తి అరుణసారిక కోరారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఉమ్మడి జిల్లా పరిధిలోని న్యాయమూర్తులతో కేసులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 98వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తిచేసేందుకు ప్రతి న్యాయమూర్తి తమవంతు కృషి చేయాలన్నారు. 20 ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసులు త్వరగా పరిష్కారమైతే కక్షిదారులకు ఇబ్బందులకు గురికారన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కుదిరేలా కేసులు పరిష్కరించాలన్నారు. కేసులు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఎంపీపీలకు గౌరవ వేతనాలేవీ?

చిత్తూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇంత వరకు గౌరవ వేతనం ఇవ్వలేదని జిల్లాలో పలువురు ఎంపీపీలు ఆందోళన వ్యక్తం చేశారు.చిత్తూరులో శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఎంపీటీసీలకు కూడా గౌరవవేతనాలు ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పరిశీలిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ





హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్ - ఉత్తమ హోంగార్డు అన్నాజయకు పురస్కారం అందజేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి చెప్పారు. శనివారం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పెరేడ్ మైదానంలో హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా హోంగార్డుల కవాతును వీక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరంఎస్పీ మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో పోలీసుల కంటే హోంగార్డులు ఎంతో ప్రశంసించతగ్గ విధంగా పనిచేస్తారన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో, రాత్రి గస్తీ తిరగడంలో, సీసీటీఎన్ఎస్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 13మంది హోంగార్డులకు ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను అందించారు. హోంగార్డులకు నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను, 2024లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. టెన్త్ నుంచి ఎంటెక్ వరకు చదువులో అత్యధిక మార్కులు సాధించిన హోంగార్డుల పిల్లలకు ఎస్పీ స్కాలర్‌షిప్పులను అందించారు. పెరేడ్ ముగిసిన తరువాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, సీఐలు మహేశ్వర, నెట్టికంఠయ్య, నిత్యబాబు, శ్రీధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలి




నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నగరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరి, నింద్ర,విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని నగరి పీసీఎన్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో కలిపినట్లయితే స్థానికులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. విద్య, వైద్య దగ్గర సదుపాయాలు తిరుపతి జిల్లాలోని తమకు అనుకూలంగా ఉన్నాయని, చిత్తూరు జిల్లా వలన తమకు ఒరిగేదేమీ లేదని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చి తిరుపతి జిల్లాకు నగరి నియోజకవర్గాన్ని చేర్చాలని పట్టుబట్టారు. సోమవారం అఖిలపక్ష ఆధ్వర్యంలో ఓంశక్తి ఆలయంనుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోదండయ్య, బాబు, మదన్ కుమార్, నిజాం వేలం, సోమశేఖర్, సుబ్రహ్మణ్యం, బాషా, మనీరాజ్, వేలు, వీరయ్య, హమీద్, సురేష్‌బాబు, మునిరత్నం, కోటి పలువురు నాయకులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల పరిధిలో ఏనుగుల హల్‌చల్

●తరిమే క్రమంలో ఒకరికి గాయాలు







ఏనుగులు తొక్కేసిన వరి పంట - ఏనుగు దాడిలో విరిగిన మామిడి చెట్టు - గాయపడ్డ తంగరాజు

బంగారుపాళ్యం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): వెలుతురుచేను,పులిమడుగు,శ్రీనివాసపురం గ్రామాల పంటల్లో ఏనుగులు విధ్వంసం సృష్టించాయి. బాధిత రైతుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు గ్రామ సమీప పొలాలపై విరుచుకుపడ్డాయి. విషయం తెలిసిన రైతులు చేరుకుని బాణసంచా కాల్చి తరిమేందుకు ప్రయత్నించారు. అయినా అవి పట్టించుకోకుండా వరి పంటను తొక్కేశాయి. మామిడి తోటలోకి వెళ్లి కొమ్మలను విరిచేశాయి. వెలుతురుచేనుకు చెందిన జగన్నాథం,పులిమడుగు గ్రామానికి చెందిన వరదయ్యరవిలకు చెందిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. వరి పంట నూర్పిడి కోసం బండపై వరి కుప్ప వేసి ఉండగా ఏనుగులు తినేశాయని వరదరాజులు అనే రైతు వాపోయాడు. ఏనుగులను మళ్లించే క్రమంలో వెలుతురుచేనుకు చెందిన తంగరాజు గాయపడ్డాడు. సమాచారం ఇచ్చినా అటవీఅధికారులు రావడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



చిన్నకంపల్లె సమీపంలో ధ్వంసమైన వరి

ఇర్లపల్లెలో ఏనుగుల దాడులు

సోమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ ఇర్లపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి నాలుగు ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా చిన్నకంపల్లె, రెడ్డివారిపల్లెల్లో మామిడి, టమోటా, వరి పొలాల్లో సంచరించి పంటలను నాశనం చేశాయి. వరికోతల సమయంలోనే ఏనుగులు సంచరించడంతో పొలాల వైపు వెళ్లలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని రైతులు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉత్తేజం



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉత్తేజం కలిగి మానసిక, శారీరక ఆరోగ్యాలు మెరుగుపడుతాయని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ తెలిపారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతోపాటు పలమనేరు నియోజకవర్గంలోని ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు, పాలిటెక్నిక్‌లలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీఎన్ మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, అది వారి భవిష్యత్తుకు చేర్పునిస్తుందని పేర్కొన్నారు. నాయకత్వ లక్షణాలు బలపడుతాయన్నారు. క్రీడా స్ఫూర్తి జీవితంలో విజయం సాధించడానికి దోహదం చేస్తుందని చెప్పారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించారు. త్రో బాల్‌లో గుడుపల్లె ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు, కుప్పం మండలం నడిమూరు మోడల్ స్కూల్ విద్యార్థులపై విజయం సాధించారు. విన్నర్స్‌కు రూ.15 వేలు, రన్నర్స్‌కు రూ.7 వేలు నగదుతోపాటు ట్రోఫీని బహూకరించారు. క్రికెట్‌లో కుప్పంలోని జెమ్స్ యెన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు, ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులపై విజతలయ్యారు. ఇందులో విన్నర్స్‌కు రూ.25 వేలు, రన్నర్స్‌కు రూ.10 వేలు నగదు బహుమతితోపాటు ట్రోఫీని ప్రదానం చేశారు. క్రీడలలో విన్నర్స్, రన్నర్స్‌కు కలిపి మొత్తం రూ.1.50 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకరబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సీజీ.శరవణ, ఫిజికల్ డైరెక్టర్ సతీశ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగ పిల్లలకు ప్రోత్సాహకాలు అందిస్తున్న తహసీల్దార్ రాము, ఎంపీడీవో అప్పాజీ

పుంగనూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పుంగనూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక భవిత కార్యాలయంలో పిల్లలకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. తహసీల్దార్ రాము, ఎంపీడీవో అప్పాజీ, ఎంఈవో రెడ్డెన్నశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

పుంగనూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మేలుపట్ల మున్సిపల్ హైస్కూల్‌కు దాత శ్రీనివాసులు దంపతులు రూ.20 వేలు విలువ కలిగిన మైక్‌సెట్‌ను శనివారం వితరణగా అందించారు. హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కి ముందుకొచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.



మైక్‌సెట్ అందజేస్తున్న దాత శ్రీనివాసులు దంపతులు

ఈ-సైకిళ్లకు 1200 దరఖాస్తులు



ఈ-సైకిళ్ల జాబితాను అందిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు ఉదయకుమార్ తదితరులు

శాంతిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న ఈ -సైకిళ్లకు శాంతిపురం మండలంలోని 23 పంచాయతీల నుంచి 1200 దరఖాస్తులు అందాయి. శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి ప్రతిఒక్కరికీ ఈ-సైకిల్ అందేలా చూడాలని అధికారులను కోరారు. క్లస్టర్ ఇన్‌చార్జి రాజేంద్ర, మురళీ, కేశవులు, రమేష్, అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



సోమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల - తిరుపతి మార్గంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి పాదాల ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాల నేపథ్యంలో శనివారం స్వామి వారికి విశేష అలంకరణలు చేపట్టారు. ఆలయంలో ప్రధాన అర్చకులు వేణుగోపాల్, మోహన్‌బాబు ఆధ్వర్యంలో గోపూజ, పంచగవ్యప్రాసన, రక్షాబంధనం, వాస్తుపూజ, వాస్తు మండల ఆరాధన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా చేశారు. 7వ తేదీన ఆలయ ఆవరణలో శ్రీవారి కల్యాణోత్సవం డాక్టర్ ప్రదీప్‌కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చంద్రశేఖర్, శ్యాంసుందర్ తెలిపారు.

నడింపల్లెలో ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



నడింపల్లెలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

సోమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు నడింపల్లెలో 7 రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక క్యాంపు శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో గౌతం, గిరిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పుంగనూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని బసవరాజ ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా శనివారం స్థానిక భగత్‌సింగ్ కాలనీలో ప్రజలకు మొక్కలు నాటడంతో కలిగే లాభాలను వివరిస్తూ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ శరవన్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

● ఘనంగా వర్ధంతి వేడుకలు



కుప్పంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కంచర్ల



పుంగనూరులో నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు



పలమనేరులో టీడీపీ నాయకుల నివాళులు



కుప్పం మున్సిపల్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులు



సోమల బస్టాండ్‌లో అన్నదానం



పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు

కుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గం యువతకు అనుసరణీయమైందని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, జాకిర్, ఇతర కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పేద బడుగు బలహీన అణగారిన వర్గాల ఉత్థాన కారకుడైన మహనీయుడు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం టీడీపీ కార్యాలయంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. బస్టాండు కూడలిలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, కౌన్సిలర్లు జిమ్ దాము, సోములతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

●**శాంతిపురం:** శాంతిపురం బస్టాండ్ సర్కిల్లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటానికి దళిత నేతలు నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ ఆధ్వర్యంలో, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీవో ఏపీఆర్ కుమార్, తహసీల్దారు ప్రకాష్‌బాబు, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ భాష్యం విశ్వనాథనాయుడు, దళిత నాయకులు , టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరులో శనివారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌కు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఆల్‌ఇండియా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ, వైసీపీ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు, బీసీ ఫ్రంట్ వ్యవస్థాపకులు అద్దంకి రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● **సోమల:** సోమల బస్టాండులో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించి అన్నదానం చేశారు. ఎస్‌ఐ శివశంకర, ఎమ్మార్పీఎస్ నాయకులు మురళీ, రామనాథం, మొగిలీశ్వరయ్య, రవి, ప్రకాశ్, వెంకట్రామయ్య, గుర్రప్ప, జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ తదితరులు పాల్గొన్నారు.

●**చౌడేపల్లె:** స్థానిక ఎస్సీ హాస్టల్ విద్యార్థులతో కలిసి స్థానిక దళిత సంఘ నాయకులు శనివారం చౌడేపల్లెలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంకు రెడ్డెప్ప, శేఖర్, కృష్ణమూర్తి, రమణ, వార్డెన్లు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** స్థానిక అంబేడ్కర్ విగ్రహం, పుంగమ్మ చెరువుకట్టపై మాలమహానాడు కార్యాలయం వద్ద వివిధ ప్రజా సంఘాల నాయకులు, దళిత నాయకులు పూలమాలలు బీఆర్ అంబేడ్కర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ఆర్.అశోక్, సుమిత్ర రమణ, శ్రీనివాసులు, రాజన్న, నాగేనాయక్, శంకర్, బీజేపీ నరసింహులు, జగదీశ్, న్యాయవాది టి.శ్రీనివాసులు, చిన్నరాయుడు, నరసింహులు, వెంకటరెడ్డి, ఎస్‌డీపీఐ అతిక్‌బాషా, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు. ● పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుబ్బరాయుడు, ఎస్‌ఐలు కెవి.రమణ, హరిప్రసాద్, అశ్వర్థనారాయణ, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, బసవరాజ ప్రభుత్వ జూనియర్ బాలికల కాలేజీ, ఎంపీడీవో , తహసీల్దారు కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కల్లూరు** : అంబేడ్కర్ అడుగుజాడల్లో అందరం నడుద్దామని మండల అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు గురుస్వామి తెలిపారు. పులిచెర్ల మండలంలోని రామిరెడ్డిగారిపల్లి, కల్లూరు, పులిచెర్లలో శనివారం అబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● **రొంపిచెర్ల:** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి పలువురు నివాళులు అర్పించారు. నాయకులు బంగారు నారాయణ, ఓబులేష్, రమేష్, సైపుల్లా, గిరబాబు, నూరేషా, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

● **సదుం:** దళిత, బహుజన నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని గుండ్లూరువారిపల్లె దళితవాడలో అంబేడ్కర్ వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు మల్లేపల్లి శ్రీనివాసులు, రెడ్డిరాణి, రమణ, రామచంద్రయ్య, రమేశ్, సుబ్రహ్మణ్యం, రాజేంద్రప్రసాద్, ఎల్లమ్మ, లక్ష్మీదేవి, అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని రామకుప్పం పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో....



శాంతిపురం టీడీపీ కార్యాలయం వద్ద...



రామకుప్పంలో టీడీపీ నాయకుల నివాళులు

ఆదర్శ హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యం



కల్లూరులో తమ ఐక్యతను చాటుతున్న హిందూ సోదరులు

కల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా అందరూ పనిచేద్దామని పుంగనూరు ఖండ వ్యవస్థ కార్యవాహ త్రిమూర్తిరెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు, కొత్తపేట, మంగళంపేటలో శనివారం హిందూ సమ్మేళనం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సమాజ సంఘటితమే దేశ అభ్యున్నతికి మార్గమన్నారు. హిందువులందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలని.. సనాతన ధర్మం ప్రతిరూపమే హిందూ సమ్మేళనమని తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనంలో భాగంగా జనవరి 9న కల్లూరు విరూపాక్షమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవకులు, హిందూ ధర్మ పరిరక్షకులు, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి అభిషేకాలు

రొంపిచెర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పట్టణ సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ ప్యానెళ్లను సరఫరా చేయాలి



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న నితిన్‌రెడ్డి

రామకుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని ఎస్టీ, ఎస్సీ వర్గాలకు చెందిన ప్రతి కుటుంబానికి త్వరగా సోలార్ ప్యానెళ్లను సరఫరా చేయాలని రామకుప్పం జడ్పీటీసీ సభ్యులు నితిన్‌రెడ్డి శనివారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో కోరారు. అలాగే రామకుప్పం-రాజుపేటక్రాస్ రహదారిలో హంద్రీ-నీవా కాలువ వద్ద దెబ్బతిన్న రహదారికి సత్వరం మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో మృతి

పలమనేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పలమనేరులో శుక్రవారం రాత్రి జరిగింది. పలమనేరులోని బండ్లవీధికి చెందిన విష్ణు (28) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే విష్ణు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే విష్ణు ఒంటిపై గాయాలు ఉండటంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఎస్‌టీయూ నూతన కార్యవర్గం




లక్ష్మీనారాయణ, భాస్కర్

పలమనేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎస్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎం.భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. శనివారం పలమనేరు గుండుబావి ఎంపీపీ పాఠశాలలో పలమనేరు డివిజన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు కె.మునెప్ప మొదలి, కుబేరనాయుడు ఆధ్వర్యంలో పలమనేరు ఎస్టీయూ శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. పలమనేరు మండల ఎస్టీయూ కోశాధికారిగా బి.వెంకటప్ప, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.రజాక్, మహిళా కన్వీనర్‌గా రమారాణి, అసోసియేట్ అధ్యక్షుడిగా టి.మణి, ఉపాధ్యక్షుడిగా హెచ్.త్రిలోక్‌చంద్, ఈ.సుబ్రహ్మణ్యం, కె.భానుమూర్తి, టి.హేమలత, బాలరాజు, కార్యదర్శులుగా టి.గురునాథ్‌గౌడు, బి.ధర్మేంద్ర, ఆర్.ఎస్.విజయ, జి.అమరావతి, సాయినిర్మల, సీపీఎస్ కన్వీనర్‌గా కె.ఎస్.రాజ్‌కుమార్, మైనారిటీ కన్వీనర్‌గా మగ్బుల్‌బాషా, జిల్లా కౌన్సిలర్లుగా టి.రవి, కె.సుబ్రహ్మణ్యం, జీఎస్ సుమతి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాడి రైతులకు అండగా సంగం డెయిరీ



నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్న సంగం డెయిరీ అధికారులు, టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ అవిర్భావం నుంచి పాడిరైతులకు అండగా నిలుస్తోందని టీడీపీ మండల కార్యదర్శి మురళీమోహన్ తెలిపారు. డెయిరీ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధి నక్కబాలేపల్లెలో పాడిరైతులకు ఆవుల్లో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ జోనల్ మేనేజర్ రవి, మేనేజర్ అనిల్‌కుమార్, పశువైద్యాధికారి ప్రభాకర్, సూపర్‌వైజర్ సురేష్, నేతలు అనంతప్ప, రమేష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గోవిందప్ప పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత విశ్వవ్యాప్తం: గరికపాటి



చిత్తూరు కల్చరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత అనేది విశ్వవ్యాప్త మైనదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. శనివారం ఆయన స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాళహస్తీశ్వర శతక ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచంలో అన్నీ ధర్మాలకన్న హైందవ ధర్మం చాలా బలమైనదని, పాశ్చత్య సంస్కృతి వందల సంవత్సరాల దేశంలో చొరబడిన మన సంప్రదాయాల ముందు నేటికి నిలవ లేకపోయాయని గరికపాటి చెప్పారు. నేటి యువత ఆధునికత పేరుతో కొంత పెడధోరణి అవలంబించినా చివరకు హైందవ ధర్మాన్నే పాటిస్తున్నాయన్నారు. నేటి సమాజంలో నిబద్ధత అనేది చాల కష్టతరమైనదన్నారు. జీవితంలో ఆధ్యాత్మికత ఎంతో సహకరిసుందన్నారు. కాళహస్తీశ్వర శతకం గురించి ఆయన విపులీకరిచారు. .నాటి జీవన కాలమాన పరిస్థితులను ఆధ్యాత్మికంగా ధూర్జటి కవి ఎంతో హృద్యంగా రచించారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ దంపతులు, ఎమ్మెల్యే తల్లీ దండ్రులు గురజాల చెన్న కేశవులు నాయుడు దంపతులు, నందకుమార్, జీడీ గోపి, కళ్యాణ్ చక్రవర్తి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సేవే లక్ష్యంగా పనిచేయాలి

రామకుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) పరిధిలో వినియోగదారుల సేవే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్ కోరారు. శనివారం రెస్కో రామకుప్పం, వి.కోట, శాంతిపురం డివిజన్ల అధికారులు, సిబ్బందికి ఫిర్యాదుల టోల్‌ఫ్రీ నెంబరు 1912పై నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. 1912 నంబరుకు వినియోగదారుల నుంచి ఫిర్యాదులపై సత్వరం స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల సమస్యల విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదన్నారు. కార్యక్రమంలో రెస్కో ఏడీ శివశంకర్, డీవో సాగర్, ఏఈ మునిరత్నం, డైరెక్టర్లు చంద్రశేఖరరెడ్డి, విజయ్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఔదార్యం..

● సదుంలోని రోడ్డుపై గుంతల పూడ్చివేత



రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న ఆటో వాలాలు

సదుం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు లేక గోతులమయంగా తయారై దుస్థితిలో ఉన్న సదుం-నాయన పాకాల రోడ్డుకు స్థానిక ఆటోవాలాలు దిక్కయ్యారు. గత వారం రోజులుగా కురిసిన ముసురు వర్షాలతో బురదమయంగా మారిన రోడ్డును అధికారులు పట్టించుకోలేదు. స్పందించిన ఆటో వాలాలు సొంత ఖర్చులతో రోడ్డుపై పేరుకుపోయిన బురద, మట్టిని తొలగించి గోతులను పూడ్చారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు రమణ, శ్రీనివాసులు, జ్యోతి, శివ, హరి, దేవేంద్ర, మస్తాన్, ఆనంద, కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన పుంగనూరు నేతలు

పుంగనూరు రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ తాళ్లూరిని పుంగనూరు జనసేన నాయకులు శనివారం హైదరాబాదులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై ఆరా తీసినట్లు తెలిపారు. పుంగనూరు నాయకులు చైతన్యరాయల్, వినోద్, సందీప్, చంద్రహాసన్, బాలాజీ, మహేశ్, రఫీ, శంకర్, సుధా, మహేశ్ తదితరులు ఆయన్ను కలిశారు.

వరసిద్ధుడి సేవలో ఏపీ ఎక్సైజ్ డైరెక్టర్



ఐరాల(కాణిపాకం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ కుటుంబ సమేతంగా శనివారం రాత్రి కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆయన్న ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వంద రోజుల ప్రణాళిక అమలు పరిశీలన

యాదమరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'వంద రోజుల కార్యక్రమం'అమలును స్పెషలాఫీసర్, ఎంపీడీవో వీరేంద్ర పరిశీలించారు. శనివారం ఆయన కె. గొల్లపల్లి హైస్కూలు ప్లస్‌ను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై అమూల్యమైన సూచనలు అందించారు.

ఈ సందర్భంగా హెచ్ఎం కంప్రిన్సిపాల్ ఏపీ లలిత, కనకాచారి, భాస్కర్ రెడ్డి, భారతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పదో తరగతి విద్యార్థులకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ, తర్ఫీదు తీసుకొని పిల్లల మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలని సూచించారు. వారితో మాట్లాడారు.

అంబేడ్కర్‌కు నేతల నివాళులు

పూతలపట్టు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):. అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా శనివారం పలువురు దళితనేతలు, కూటమి నాయకులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, నాయకులు చిరంజీవి, గుంటూరు మురళి, గాజుల భాస్కర్, హరి, నాగరాజు, ఇంద్రసేన నాయుడు, రవినాయుడు, ఏకాంబరం, బాలక్రిష్టమ నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌కు ఘన నివాళులు

పాలసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కరుకు నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా శనివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుళ్‌నాథన్, సాంబశివన్, శేఖర్‌రాజు,శీనురాజు,సాయిరా తదితరులు పాల్గొన్నారు. **ఐరాల:** పాటూరులో పొలకల ఉపసర్పంచ్ బత్తలసురేంద్రనాయుడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నటరాజ, వెంకటరత్నం, విశ్వనాథం, గుర్రప్ప, దాము తదితరులు పాల్గొన్నారు. **శ్రీరంగరాజపురం:** మండలం కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి డీఎస్పీ సయ్యద్ మహ్మమద్ అజీజ్, కాంగ్రెస్ ఇంచార్జి రమేష్ బాబు, బీజేపీ కన్వీనర్ రాజేంద్రన్, పూలమాల వేసి నివాళార్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎన్. కుమార్, దశరథ, చందు, తదితరులు పాల్గొన్నారు. **విజయపురం:** పన్నూరు, మహారాజపురం, ఇళ్ళత్తూరు, ఆలపాకంలో అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళీ అర్పించారు. ఇళ్ళత్తూరులో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్ యూనియన్ అధ్యక్షుడు సెల్వం, పురుషోత్తం, మహేంద్ర, బాబు పాల్గొన్నారు. గంగాధరనెల్లూరు: అంబేద్కర్ విగ్రహానికి **పెనుమూరు** మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిద్యాస్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండరెడ్డి, శ్రీధర్‌యాదవ్, మండల సింగిల్ విండో అధ్యక్షుడు మోహన్‌నాయుడులు పూలమాలవేసి నివాళులు అర్పించారు.

యాదమరి: తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు. సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ కుమార్ ఇరువారంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పాలు, పండ్లు, భోజనాలను అందజేశారు. ఎంపీడీవో వీరేంద్ర, డీటీ జయంతి కుమార్, చిట్టిబాబు, ఏసు, బాలు పాల్గొన్నారు. **గుడిపాల:** మండల కేంద్రంలో కూటమి నాయకులు నిర్వహించారు. చిత్తూరు పార్లమెంటు ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్, మండల బీజేపీ అధ్యక్షురాలు రమాదేవి తదితరులు అంబేద్కర్‌కు నివాళులర్పించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు.


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చిత్తూరు పార్లమెంటు ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కృష్ణమనాయుడు, నేతలు



మృతుడి గుర్తింపు కోసం పోలీసుల అన్వేషణ


మృతదేహంపై టాటూ, పచ్చబొట్లు (ఫైల్‌ఫొటో)

యాదమరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడితిరెడ్డిపల్లి సమీపంలో దాదాపు ఏడాదిన్నర క్రితం లభ్యమైన ఒక గుర్తుతెలియని పురుషుడి మృతదేహం కేసులో గుర్తింపు కోసం పోలీసులు సహాయం కోరుతున్నారు. ఎస్‌ఐ ఈశ్వర్ వివరాల మేరకు నిర్మాణంలో ఉన్న ఎక్స్‌ప్రెస్ హైవే పక్కన అప్పట్లో ఈ మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికల ప్రకారం మృతుడి శరీరంపై గాయాలు లేవు.తే, దేహంపై "మణి మేఘలై" అని పచ్చబొట్టు (టాటూ) ఉండడం ప్రధాన ఆదారమవుతుందని పోలీసులు భావించారు. మృతుడు తమిళనాడు లేదా కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ లక్షణాలున్న వ్యక్తి ఎవరైనా మిస్సింగ్ అయితే లేదా ఆ వ్యక్తిని ఫోటోల ద్వారా గుర్తించగలిగితే వెంటనే యాదమరి పోలీసు స్టేషన్ (9440900684)ను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

చెట్ల నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు


మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామ్మోహన్

గుడిపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటూరు గ్రామానికి చెందిన మాధవి అనే మహిళకు చెందిన మామిడి చెట్లను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ఈమె పొలంలో సుమారు 61 చెట్లను నరికివేశారు. బాధితురాలు ఈమేరకు శనివారం పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఎస్‌ఐ రామ్మోహన్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేశారు. చెట్లు నరకడానికి గల కారణాలపై ఆరాతీస్తున్నారు. నిందితులను గుర్తించి త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు.

అర్చకుల సమస్యలను పరిష్కరిస్తాం

చిత్తూరు కల్చరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దేవాదదాయ శాఖ ఆ ధ్వర్యంలో ఆలయాల్లో అమలు అవుతున్న ధూపదీప నైవేద్యం పథకంలోని లోటు పాట్లని పరిష్కరిస్తామని దేవదాయ అధికారులు అన్నారు. శనివారం స్థానిక పొన్నియమ్మగుడి వీధిలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో ధూపదీప పథక లబ్దిదారుల సమీక్షా సమావేశం నిర్వాహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 60 మంది అర్చకులు, ఆలయాల నిర్వాహకులు, హజరు అయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను రాత పూర్వకంగా తెలియపర్చారు. అర్చక సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు











వంద రోజుల స్టడీ ప్రణాళిక ప్రారంభం

● రోజూ స్లిప్ టెస్టు ● పర్యవేక్షించనున్న కలెక్టర్



విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ టెస్టు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు వంద రోజుల స్టడీ అవర్ ప్రణాళిక శనివారం నుంచి మొదలైంది. వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు టెన్త్ పరీక్షల నేపథ్యంలో ఇప్పటినుంచే అధికారులు గట్టి కసరత్తుకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు సంబంధించి 537 ఉన్నత పాఠశాలల్లో 20వేల మంది టెన్త్ విద్యార్థులు ఉన్నారు. ఇందులో 355 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో దాదాపు 9 వేల మంది ఉన్నారు. మార్చి 15 ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజూ వివిధ సబ్జెక్టుల్లో రివిజన్ అపై పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. ఉదయం 8-9 గంటల మధ్య రెమిడియల్ తరగతి ఉంటుంది. 9.15-10.40 వరకు ఫస్టు సెషన్, 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు సెకండ్ సెషన్, 1.05-2.30 గంటలకు మూడో సెషన్, 2.40 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నాల్గో సెషన్, 4-5 గంటల మధ్య అసెస్‌మెంట్ (స్లిప్ టెస్టు) పరీక్ష నిర్వహించాలి. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఫిజిక్స్, బయాలజీ, సోషల్‌స్టడీస్‌లలో ప్రతి రోజూ నాలుగు సబ్జెక్టులు ఖచ్చితంగా రివిజన్ చేయిస్తారు. పరీక్ష అనంతరం పేపర్లు మూల్యాంకనం చేసి వెనువెంటనే లీప్ యాప్‌లో మార్కులు పోస్టు చేయాల్సి ఉంది. లీప్ యాప్‌ను జిల్లా కలెక్టర్ రోజూ పర్యవేక్షించనున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి 19వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు, మార్చి 2 నుంచి 12వ తేదీ వరకు గ్రాండ్ టెస్టు జరుగుతుంది. శని, ఆదివారాల్లోనూ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు.

సామాజిక సమానతకు అంబేడ్కర్ బాట

● కలెక్టర్ సుమిత్‌కుమార్ నివాళి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ తదితరులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):దేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులన్నింటినీ కూడా సరిసమానం చేసిన గొప్ప దేశ భక్తుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కలెక్టర్ సుమిత్‌కుమార్ శ్లాఘించారు. శనివారం స్థానిక దర్గా కూడలి వద్ద అంబేడ్కర్‌వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మీడియాతో జిల్లాలో దళితవాడలను అభివృద్ధికి రూ.13కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాలలో అంగన్‌వాడీ, సోలార్‌విద్యుత్, తాగునీటిపైపులనిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణపు పనులు, చేతిబోరు మరమ్మతులు, శ్మశానవాటికల అభివృద్ధి కోసం చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారిని బెదిరించిన గ్రామ కార్యదర్శి

వెదురుకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):నాకే మెమో ఇస్తావా? నీ అంతు చూస్తానంటూ గ్రామ సచివాలయ, వార్డు డెవలప్‌మెంట్ అధికారి(జీఎస్‌డబ్ల్యుఎస్) నిరంజన్‌రెడ్డిపై వెదురుకుప్పం మండలం జక్కిదొన గ్రామ సచివాలయ కార్యదర్శి ఆర్.వి.బాలకృష్ణ బెదిరించారు. వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన ఈ సంఘటన చర్చనీయాంశమైంది.వెదురుకుప్పం జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి నిరంజన్‌రెడ్డి సచివాలయ ఉద్యోగుల హాజరు, విధి నిర్వహణను పర్యవేక్షించాల్సి వుంది.జక్కిదొన గ్రామ కార్యదర్శి బాలకృష్ణ రెండు రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో శనివారం మెమోను మార్క్ చేసి సచివాలయ కార్యదర్శుల గ్రూపులో పోస్ట్ చేశారు.మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు.ఎంపీడీవో పురుషోత్తం, డీఎల్‌డీవో రవికుమార్, డీపీవో సుధాకరరావుకు సమాచారం ఇచ్చి ఆ మెమోను మార్క్ చేశారు. దీన్ని జీర్ణించుకోలేని బాలకృష్ణ ఎంపీడీవో కార్యాలయం చేరుకుని నిరంజన్‌రెడ్డిని బెదిరించారు.ఈ విషయాన్ని కూడా నిరంజన్‌రెడ్డి డీపీవో సహా జిల్లా అధికారులకు, సెలవులో ఉన్న ఎంపీడీవో పురుషోత్తంకు తెలియజేశారు.

తిరుపతి సంస్కృత వర్సిటీలో కీచక పర్వం

ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ సస్పెన్షన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న కీచకపర్వమిది. ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్ ఒడిశాకు చెందిన డిగ్రీ విద్యార్థినితో సంబంధం పెట్టుకుని గర్భవతిని చేయగా అదే విభాగానికి చెందిన మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. శేఖర్‌రెడ్డి వారి రాసలీలలను సెల్ ఫోన్‌లో చిత్రీకరించినట్టు సమాచారం.ఆ వీడియోలను చూపి శేఖర్‌రెడ్డి కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.బాధిత విద్యార్థిని యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో లక్ష్మణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. బాధిత విద్యార్థిని ఇటీవల టీసీ తీసుకొని ఒడిశాలోని సొంత ప్రాంతానికి వెళ్ళి పోగా వర్సిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు. అయితే ఫిర్యాదును బాధితురాలు ఇవ్వాలని పోలీసులు సూచించడంతో సస్పెన్షన్‌తో సరిపెట్టేశారు.ఈ విషయమై రిజిస్ట్రార్ వెంకట నారాయణరావును అడగ్గా బాధిత విద్యార్థిని ఫిర్యాదుతో ఈ ఘటనపై లోతుగా విచారణ చేపడుతున్నామని చెప్పారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనకు తావివ్వకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సుదీర్ఘ చరిత్ర కల్గిన సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటు చేసుకుంటున్న ఘటనలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. కొంత కాలం క్రితం యూనివర్సిటీలో డ్రగ్స్ పట్టుబడగా ఇప్పుడు కీచకపర్వం బయటపడి విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ మసకబారుతోంది.

పర్యాటక కేంద్రంగా కంగుంది అభివృద్ధి

కుప్పం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలో ప్రాచీన చరిత్ర కలిగిన ఒకప్పటి కంగుంది సంస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు అన్నారు. కంగుంది దుర్గంపై జనవరి 6, 7 తేదీలలో నిర్వహించనున్న బోల్డ్ రింగ్ జిమ్ (హిల్ ట్రెక్కింగ్) కార్యక్రమ సన్నాహక సమావేశాన్ని కంగుందిలో శనివారం నిర్వహించారు. కంగుంది చరిత్ర పుస్తకాన్ని ప్రముఖులు ఆవిష్కరించారు. పర్యాటకులు కూర్చునేందుకు అనువైన స్టే హోమ్, కంగుంది గుర్గం ట్రెక్కింగ్ నమూనాలను కూడా ఆవిష్కరించారు.





బహుమతులు అందుకున్న పిల్లలతో నిర్వాహకులు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డి - బాలోత్సవానికి హాజరైన విద్యార్థులు

ఉత్సాహంగా బాలోత్సవం

పలమనేరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చిన్నతనం నుంచే విద్యార్థులు దేశభక్తిని అలవరచుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. పలమనేరులోని ఓఎల్ఎల్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన బాలోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించాలన్నారు. క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా రాణించాలని కోరారు. ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. బాలోత్సవంలో నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 3 వేల మందికి పైగా చిన్నారులు హాజరై వివిధ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం పోటీల్లో విజేతలైన చిన్నారులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ, ఎంఈవోలు బాలసుందరం, వేణుగోపాల్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీనాయకులు సుబ్రహ్మణ్యం గౌడు, కుట్టి, గిరిబాబు, ఖాజాపీర్, నాగరాజు, కృష్ణమూర్తిగౌడు, బీఆర్సీ కుమార్, నదీమ్, శ్రీనివాసులు, మంజునాథ్, మురళీ, సుధాకర్, వీరప్ప, భాస్కర్, కమిటీ సభ్యులు తులసినాథం నాయుడు, యుగంధర్, గిరిధరమూర్తి, బాలాజీ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో వేడెక్కిన రాజకీయం

● ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తిన ఎంపీటీసీలు

గుడిపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది.ఎంపీపీ ప్రసాదరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది.మండలంలో 12 మంది ఎంపీటీసీ సభ్యులుండగా 8మంది ఎంపీపీపై అవిశ్వాసానికి మద్దతిచ్చారు.మూడేళ్ల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను గుడిపాల మండలంలో టీడీపీ బహిష్కరించింది. అయితే టీడీపీ తరపున ఒకరు పోటీలో నిలిచారు. 11 స్థానాలను వైసీపీ కైవసం చేసుకోగా ఒక్కస్థానం టీడీపీకి దక్కింది. అప్పటి నుంచి వైసీపీ తరపున గెలిచిన ప్రసాదరెడ్డి ఎంపీపీగా, జయప్రియ, గోపి వైస్ ఎంపీపీలుగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం 11మంది ఎంపీటీసీల్లో ఒకరైన హరి టీడీపీలోకి వచ్చారు. కొందరు టీడీపీ నాయకులతో కలసి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు పావులు కదిపారు. ఆర్డీవో ద్వారా ఎంపీటీసీలకు నోటీసులను జారీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 11.35 గంటలకు ఎంపీడీవో కార్యాలయానికి 8మంది ఎంపీటీసీలు చేరుకున్నారు.ఆర్డీవో శ్రీనివాసులు ముందు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో ఆర్డీవో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రకటించి నివేదికను జడ్పీ సీఈవోకు అందజేయనున్నట్లు తెలిపారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపిన వారిలో నారగల్లు ఎంపీటీసీ జయప్రియ, చిత్తపార ఎంపీటీసీ గోపీనాథ్,గుడిపాల ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద చౌదరి, పానాటూరు ఎంపీటీసీ మొగిలిరెడ్డి, 197రామాపురం ఎంపీటీసీ శ్రీదేవి, బసవాపల్లె ఎంపీటీసీ లీనారాయ్, పాపసముద్రం ఎంపీటీసీ బాలమ్మ, వసంతాపురం ఎంపీటీసీ విజయలక్ష్మి ఉన్నారు.వీరంతా కలిసి త్వరలో కొత్త ఎంపీపీని ఎన్నుకోనున్నారు. అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్ఐ రామ్మోహన్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శిరీష, కార్యదర్శి సుందరేశన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరిస్తా: ఎమ్మెల్యే

అవిశ్వాస తీర్మానం నెగ్గాక ఎంపీటీసీ సభ్యులు గుడిపాలకొచ్చిన ఎమ్మెల్యే జగన్మోహన్‌ను కలిశారు.ఆయన వారితో మాట్లాడుతూ అభివృద్ధి పనులు కావాల్సి వస్తే ఖచ్చితంగా తాను పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ విషయంలో పార్టీలకతీతంగా వ్యవహరిస్తానని చెప్పారు.

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

● జిల్లా అరుణసారిక



డీజే అరుణసారికకు జ్ఞాపికను అందజేస్తున్న న్యాయమూర్తి

చిత్తూరు లీగల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా కోర్టులలో దీర్ఘకాలిక పెండింగ్ కేసులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా న్యాయమూర్తి అరుణసారిక కోరారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఉమ్మడి జిల్లా పరిధిలోని న్యాయమూర్తులతో కేసులపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 98వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని త్వరగా పూర్తిచేసేందుకు ప్రతి న్యాయమూర్తి తమవంతు కృషి చేయాలన్నారు. 20 ఏళ్ళుగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేసులు త్వరగా పరిష్కారమైతే కక్షిదారులకు ఇబ్బందులకు గురికారన్నారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కుదిరేలా కేసులు పరిష్కరించాలన్నారు. కేసులు పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ఎంపీపీలకు గౌరవ వేతనాలేవీ?

చిత్తూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇంత వరకు గౌరవ వేతనం ఇవ్వలేదని జిల్లాలో పలువురు ఎంపీపీలు ఆందోళన వ్యక్తం చేశారు.చిత్తూరులో శనివారం జడ్పీ సర్వసభ్య సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఎంపీటీసీలకు కూడా గౌరవవేతనాలు ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై పరిశీలిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ





హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ తుషార్ - ఉత్తమ హోంగార్డు అన్నాజయకు పురస్కారం అందజేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా ఎస్పీ తుషార్ డూడి చెప్పారు. శనివారం జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పెరేడ్ మైదానంలో హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోంగార్డుల కవాతును వీక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరంఎస్పీ మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో పోలీసుల కంటే హోంగార్డులు ఎంతో ప్రశంసించతగ్గ విధంగా పనిచేస్తారన్నారు. శాంతి భద్రతలను కాపాడటంలో, రాత్రి గస్తీ తిరగడంలో, సీసీటీఎన్ఎస్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 13మంది హోంగార్డులకు ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను అందించారు. హోంగార్డులకు నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినవారికి బహుమతులను, 2024లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారికి సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. టెన్త్ నుంచి ఎంటెక్ వరకు చదువులో అత్యధిక మార్కులు సాధించిన హోంగార్డుల పిల్లలకు ఎస్పీ స్కాలర్‌షిప్పులను అందించారు. పెరేడ్ ముగిసిన తరువాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీఎస్పీ సాయినాథ్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాష, సీఐలు మహేశ్వర, నెట్టి కంఠయ్య, నిత్యబాబు, శ్రీధర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నగరి, నిండ్ర, విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నగరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరి, నిండ్ర,విజయపురం మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని నగరి వీసీఎన్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో కలిపినట్లయితే స్థానికులు తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. విద్య, వైద్య దగ్గర సదుపాయాలు తిరుపతి జిల్లాలోని తమకు అనుకూలంగా ఉన్నాయని, చిత్తూరు జిల్లా వలన తమకు ఒరిగేదేమీ లేదని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చి తిరుపతి జిల్లాకు నగరి నియోజకవర్గాన్ని చేర్చాలని పట్టుబట్టారు. సోమవారం అఖిలపక్ష ఆధ్వర్యంలో ఓంశక్తి ఆలయంనుంచి టవర్‌క్లాక్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోదండయ్య, బాబు, మదన్ కుమార్, నిజాం వేలం, సోమశేఖర్, సుబ్రహ్మణ్యం, బాషా, మనీరాజ్, వేలు, వీరయ్య, హమీద్, సురేష్‌బాబు, మునిరత్నం, కోటి పలువురు నాయకులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల పరిధిలో ఏనుగుల హల్‌చల్

●తరిమే క్రమంలో ఒకరికి గాయాలు







ఏనుగులు తొక్కేసిన వరి పంట - ఏనుగు దాడిలో విరిగిన మామిడి చెట్టు - గాయపడ్డ తంగరాజు

బంగారుపాళ్యం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): వెలుతురుచేను,పులిమడుగు,శ్రీనివాసపురం గ్రామాల పంటల్లో ఏనుగులు విధ్వంసం సృష్టించాయి. బాధిత రైతుల కథనం ప్రకారం శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు గ్రామ సమీప పొలాలపై విరుచుకుపడ్డాయి. విషయం తెలిసిన రైతులు చేరుకుని బాణసంచా కాల్చి తరిమేందుకు ప్రయత్నించారు. అయినా అవి పట్టించుకోకుండా వరి పంటను తొక్కేశాయి. మామిడి తోటలోకి వెళ్లి కొమ్మలను విరిచేశాయి. వెలుతురుచేనుకు చెందిన జగన్నాథం,పులిమడుగు గ్రామానికి చెందిన వరదయ్య,రవిలకు చెందిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. వరి పంట నూర్పిడి కోసం బండపై వరి కుప్ప వేసి ఉండగా ఏనుగులు తినేశాయని వరదరాజులు అనే రైతు వాపోయాడు. ఏనుగులను మళ్లించే క్రమంలో వెలుతురుచేనుకు చెందిన తంగరాజు గాయపడ్డాడు. సమాచారం ఇచ్చినా అటవీఅధికారులు రావడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.



చిన్నకంపల్లె సమీపంలో ధ్వంసమైన వరి

ఇర్లపల్లెలో ఏనుగుల దాడులు

సోమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ ఇర్లపల్లె సమీపంలో శుక్రవారం రాత్రి నాలుగు ఏనుగులు పంటలను ధ్వంసం చేశాయి. రెండు రోజులుగా చిన్నకంపల్లె, రెడ్డివారిపల్లెల్లో మామిడి, టమోటా, వరి పొలాల్లో సంచరించి పంటలను నాశనం చేశాయి. వరికోతల సమయంలోనే ఏనుగులు సంచరించడంతో పొలాల వైపు వెళ్లలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారని రైతులు తెలిపారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు



నగరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని టీఆర్ కండ్రిగ సమీపంలో ఇందిరమ్మ కాలనీ రోడ్డుకు మోక్షం కలిగింది. గుంతలమయమైన ఈ దారిలో ఇబ్బంది పడుతున్నామని మూడు రోజుల క్రితం మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వెంటనే స్పందించారు. రోడ్డుపై గుంతలు పూడ్చాల్సిందిగా ఆదేశించారు. గురువారం టీడీపీ నాయకులు గ్రావెల్‌తో ఈ రహదారిని చదును చేశారు. ఇప్పటికే ఈ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేశారు. టెండరు పిలిచి పనులు అప్పగించారని టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుణశేఖర్ తెలిపారు. వర్షాలు తగ్గగానే పనులు చేపడతారన్నారు.

నాణ్యతగా నిర్మాణ పనులు చేపట్టాలి



ప్రహరీగోడ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు, ప్రహరీగోడల నిర్మాణపు పనులను నాణ్యతతో చేపట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కాంట్రాక్టరను ఆదేశించారు. శనివారం పలమనేరు రోడ్డులో దర్గా సర్కిల్ వద్ద, కన్నన్ కళాశాల జరుగుతున్న ప్రహరీగోడ నిర్మాణపు పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి నాణ్యతకు ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా జరుగుతున్న ఆక్రమణలను పరిశీలించారు. దర్గా సర్కిల్ నుంచి ఇరువారం వరకు రోడ్డు పనులను పరిశీలించి చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు నరేష్, కార్పొరేటర్ అశోక్, నేతలు పాల్గొన్నారు.

చిత్తూరు-కామాలూరు బస్ సర్వీసు ప్రారంభం



బస్సు సర్వీసు ప్రారంభ కార్యక్రమంలో మురళీ మోహన్,నేతలు

తవణంపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కామాలూరు ల మధ్య బస్సు సర్వీసును ఎమ్మెల్యే మురళీ మోహన్ ఈచనేరిలో శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా బస్సుకు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, ఐరాల మండల అధ్యక్షుడు హరిబాబు నాయుడు, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ నాయుడు, పారిశ్రామిక వేత్త రఘురామ చౌదరి, నాయకులు గోపి, ప్రవీణ్, గాంధీ, ఆర్టీసీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జయప్రకాష్ నాయుడికి శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న మణినాయుడు

ఐరాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం టీడీపీ నాయకుడు ఎన్పీ.జయప్రకాష్ నాయుడిని కాణిపాక వినాయక స్వామి ఆలయ చైర్మన్ మణినాయుడు వజ్రాలపుర గంగమ్మ ఆలయం వద్ద శనివారం కలసి శనివారం పుట్టినరోజు శుభాకాంక్షలను తెలియజేశారు. వరసిద్ధుని ప్రసాదాన్ని అందించారు. కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్,మద్దిపట్లపల్లె మాజీ ఎంపీటీసీ నాగేశ్వరచౌదరి పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వామిత్వ సర్వే నిర్వహణ



మాట్లాడుతున్న ఎంపీడీవో మనోహర్‌గౌడ్

గంగాధరనెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 14 రెవిన్యూ గ్రామాల్లో స్వామిత్వ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఎంపీడీవో ఆఫీస్‌లో పంచాయతీకార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయం సర్వేయర్లుతో స్వామిత్వ సర్వేపై వారు సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సర్వేసిబ్బంది గ్రామాల్లోకి వచ్చినపుడు భూములు, ఇళ్లకు సంబంధించి రాకార్డులు చూపించి సర్వేలో నమోదుచేసుకోవాలన్నారు. ఖాళీస్థలాల వివరాలు, గ్రామకంఠం భూములను గుర్తించి నమోదు చేస్తారన్నారు.

నేడు దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ

చిత్తూరు కల్చరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో ఆదివారం దివ్యాంగులకు వీల్ చౌర్స్ పంపిణీ చేయనున్నట్లు సత్యసాయి సేవాసమతి జిల్లా అధ్యక్షులు, యస్ మధుసూధనం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యాక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ జేడి మురళీకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ వెంకట రమణమూర్తిలు పాల్గొననున్నారని సమితి నగర కన్వీనర్ ఆర్, ప్రభాకర్ నాయుడు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



ప్రశాంత్ (ఫైల్ ఫొటో)

తవణంపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ చిరంజీవి కథనం మేరకు వివరాలు. ఊగువమోదలపల్లె హరిజనవాడకు చెందిన పదిహేడేళ్ల ప్రశాంత్ బంగారుపాళ్యంలో ఇంటర్ రెండోవ సంవత్సరం చదువుతున్నాడు. సెల్ ఫోన్ ఎక్కువ సమయం చూస్తున్నాడని రెండు రోజుల క్రితం తల్లి మందలించింది. ఈక్రమంలో 3వ తేదీన కాలేజికి వెళ్లి తిరిగిరాలేదు. తల్లి రేవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధితులకు దుప్పట్ల పంపిణీ



నింద్ర, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేవీబీ పురం మండలంలోని కళత్తూరు దళితవాడ వాసులకు కావనూరు మాజీ ఎంపీటీసీ టీడీపీ నాయకుడు జగన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ అసోసియేషన్ నార్త్ అమెరికా సౌజన్యంతో చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శనివారం కళత్తూరు దళితవాడలో సుమారు 400 మందికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ఏటా అంబేడ్కర్ వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతి అందజేస్తున్న ఎంఈవో విజయకుమార్

వెదురుకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని శనివారం కార్వేటినగరం భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈక్రమంలో దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కార్వేటినగరం ఎంఈవో విజయకుమార్ సూచించారు. అనతరం దివ్యాంగులకు బహుమతులను అందజేశారు.

దివ్యాంగుల పట్ల చిన్నచూపు తగదు



బహుమతులను అందజేస్తున్న ఎంఈవో దామోదరం

వెదురుకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల చిన్నచూపు తగదని ఎంఈవో దామోదరం పేర్కొన్నారు. శనివారం పచ్చికాపల్లం భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, భవిత కేంద్రాలు దివ్యాంగ పిల్లలకు చేయూతనిస్తాయన్నారు. భవిత కేంద్రం పిల్లలకు బహుమతులను అందజేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ హెచ్‌ఎం ఎస్. అశోక్‌బాబు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు కమలనాభన్, దేశయ్య, స్పెషల్ ఎడ్యుకేటర్ రాజశేఖర్, శ్యామల, గుణ, హేమలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ఏపీ ఎక్సైజ్ డైరెక్టర్



రాహుల్‌దేవ్‌శర్మకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌శర్మ కుటుంబ సమేతంగా శనివారం రాత్రి కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆయన్న ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు,జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఇట్టిబాబు పాల్గొన్నారు.

బడుగువర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ విశేష కృషి





చిత్తూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద డీవీఎంసీ సభ్యులు, అధికారులు, సిబ్బంది నివాళులు- అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే గురజాల తదితరులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం అధికారులు, రాజకీయ పార్టీల నేతలు, దళిత సంఘాల నేతలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దర్గాసర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి సాంఘిక సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది, డీవీఎంసీ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ బడుగు వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ విశేష కృషి చేశారన్నారు. ఆయన అందించిన రాజ్యాంగ ఫలాలు దేశానికి చక్కని బాట వేశాయంటూ నివాళులర్పించారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కూటమి నేతలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు. **చిత్తూరు రూరల్:** ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు, యాచకులకు, భవితా కేంద్ర పిల్లలకు పండ్లు, అన్నదానం చేశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, నాయకులు ఓబులేసు, మురళి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. **చిత్తూరు:** డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, నేతలు మోహన్‌రాజ్, మేషాక్, రఘు, రమేష్, బాబు, రవిచంద్రన్, రాణి తదితరులు పాల్గొన్నారు.





చిత్తూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు- ప్రభుత్వ ఆస్పత్రి వద్ద అన్నదానం

క్రీడా విజేతలకు అభినందన



క్రీడాకారులతో ఎంపీడీవో, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్

వెదురుకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించిన క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపిక కావాలని కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళి ఆకాంక్షించారు. శనివారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న, ఫిజికల్ డైరెక్టర్ కిషోర్‌కుమార్,హెచ్‌ఎం నాదముని, సరస్వతి, మాలతి, కలైవాణి, బొజ్జారాము, సుమతి, రవి, రాములు, రంజిత్‌కుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు, వైస్ చైర్మన్ సంధ్య పాల్గొన్నారు.

ఎన్పీ జయప్రకాష్‌కు పలువురి శుభాకాంక్షలు



కేక్ కట్ చేస్తున్న ఎన్పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ జన్మదిన వేడుకలు శనివారం అభిమానుల నడుమ ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి ఆయన పూలమాల వేశారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను జయప్రకాష్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అంతకు ముందు శేషాపురం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,కాణిపాకం ఆలయ చైర్మెన్ మణినాయుడు, పూతలపట్టు,ఐరాల,తవణంపల్లె,యాదమరి మండలాల అధ్యక్షులు, ఎన్పీ ధరణీప్రసాద్, మాజీ మార్కెట్ చైర్మెన్ ఎన్పీ జయచంద్రనాయుడు, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ సురేంద్రనాయుడు, ఎన్ఆర్ఐ విక్రమ్, మాజీ ఎంపీపీ సుచిత్ర, హేమచంద్రనాయుడు, లోకనాథనాయుడు తదితరులు ఆయన్ను దుశ్శాలువాలు,పూలమాలల వేసి సన్మానించారు.

నలగాంపల్లె రోడ్డు ప్రారంభం

బంగారుపాళ్యం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): నలగాంపల్లె పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే మురళీ మోహన్, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్,సర్పంచు షీబా స్వామిదాస్‌లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30 లక్షల తో 1.2 కిలో మీటర్లు ఈ రోడ్డు నిర్మించామన్నారు. మంగళపల్లె పంచాయతీ కుప్పాలపల్లె రోడ్డు పనులకు రూ. కోటి 20 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ప్రసన్నకుమారి, రామభద్రనాయుడు, జనార్దన్‌గౌడ్,నాగరాజ్ గౌడ్, చిన్నెయ్య, ఎన్పీ పృథ్వీ, మాజీ ఎంపిటిసి గిరిబాబు, సుజాతలు పాల్గొన్నారు.

కష్టించే తత్వంతో పురోగతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటాచలపతి

నగరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని నగరి పీసీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి హితవు పలికారు. జూనియర్ కళాశాలలో శనివారం జరిగిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంప్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉంటే సమాజ అభివృద్ధికి సాయం చేసినట్లు అవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్‌లో ఉత్తమ వలంటీర్లకు బహుమతులను ప్రదానం చేశారు. సమావేశంలో వినాయకపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసన్న, రాజకుమారి, ఇళంగోవన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ విభజనకు అంగీకారం



విభజనపై అభిప్రాయ సేకరణలో పాల్గొన్న ప్రజలు

వెదురుకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ విభజనకు జనం అంగీకరించినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి రాము శనివారం తెలిపారు. ఈ పంచాయతీని బొమ్మయ్యపల్లె, దేవళంపేటు పంచాయతీలుగా విభజించడం కోసం శనివారం బొమ్మయ్యపల్లె సచివాలయం వద్ద ఉప సర్పంచ్ బాలక్రిష్ణమనాయుడు అధ్యక్షతన రెండు పంచాయతీల ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చేతులు ఎత్తే పద్ధతి అమలు చేశారు. ఎక్కువ మంది విభజనరే మొగ్గు చూపారన్నారు. ఈమేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనపంపిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌ని బలోపేతం చేయండి




శెల్వంను సన్మానిస్తున్న షర్మిల

గుడిపాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సూచించారు. శనివారం విజయవాడలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, చిత్తూరు జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరి సెల్వం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ విధివిధానాలను తెలిపి పూర్తిస్థాయిలో కృషిచేయాలన్నారని సెల్వం తెలిపారు.

వేణుగోపాలుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఆలయ ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ● కార్వేటినగరంలో రుక్మిణీ,సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం మర్రిమాకులకండ్రిగ గ్రామానికి చెందిన బి.చంద్రారెడ్డి కుటుంబీకుల అన్నవితరణ చేశారు.

మహిళల అభ్యున్నతి ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్

నగరి,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్ పేర్కొన్నారు. శనివారం కార్యాలయ నెహ్రూ మహిళ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో బ్యాంకు రుణాలను పీఎంఈజీపీ రుణాలను మంజూరు చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని కొత్త యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళలు స్వయంగా ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యమన్నారు.కార్యక్రమంలో ఎన్.ప్రసాద్, శేఖర్, శ్రీధర్, గోపి, తిరుమయ్యపలువురు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత విశ్వవ్యాప్తం: గరికపాటి



చిత్తూరు కల్చరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత అనేది విశ్వవ్యాప్త మైనదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు అన్నారు. శనివారం ఆయన స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు నారాయణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాళహస్తీశ్వర శతక ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచంలో అన్నీ ధర్మాల కన్న హైందవ ధర్మం చాలా బలమైనదని, పాశ్చాత్య సంస్కృతి వందల సంవత్సరాల దేశంలో చొరబడిన మన సంప్రదాయాల ముందు నేటికి నిలవ లేకపోయాయని గరికపాటి చెప్పారు. నేటి యువత ఆధునికత పేరుతో కొంత పెడధోరణి అవలంబించినా చివరకు హైందవ ధర్మాన్నే పాటిసున్నాయన్నారు. నేటి సమాజంలో నిబద్దత అనేది చాల కష్టతరమైనదన్నారు. జీవితంలో ఆధ్యాత్మికత ఎంతో సహకరిసుందన్నారు. కాళహస్తీశ్వర శతకం గురించి ఆయన విపులీకరిచారు. .నాటి జీవన కాలమాన పరిస్థితులను ఆధ్యాత్మికంగా ధూర్జటి కవి ఎంతో హృద్యంగా రచించారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ దంపతులు, ఎమ్మెల్యే తల్లీ దండ్రులు గురజాల చెన్న కేశవులు నాయుడు దంపతులు, నందకుమార్, జీడీ గోపి, కళ్యాణ్ చక్రవర్తి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.